క్లుప్తంగా

రేడియో, టీవీ ఆర్టిస్టు రేవతి శంకర్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం ఇంటిగుట్టు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం కార్తవరాయనికథ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ రేడియో, టీవీ ఆర్టిస్టు కేసనకుర్తి రేవతి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూరపనేని అనురాధ, పడవల కమల, ఎస్.ఉమ, దేవరపల్లి భవాని, కేసనకుర్తి శంకర్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగస్, గుమ్మడి ప్రసాద్, పడవల హరిప్రసాద్, సీహెచ్ రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకోవాలి

తెనాలిటౌన్: తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులు కార్మిక సంక్షేమ బోర్డులో కార్మికులుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ డీవీ శివప్రసాద్ తెలిపారు. మారీసుపేటలోని కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకున్నట్లయితే ప్రభుత్వ పథకాలు పొందవచ్చన్నారు. వైఎస్సార్ బీమాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, నామిని ఆధార్ జెరాక్స్‌లను అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు యూనియన్ బ్యాంకులో చెల్లించిన రూ.110 చలానా జత చేయాలని చెప్పారు. డివిజన్ పరిధిలోని కార్మికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అధికారులు ఎం.వినయ్‌కుమార్ (తెనాలి), బి.మహబూబ్ సుభాని(తెనాలి), వి.సాయిజ్యోతి(పొన్నూరు), వీపీఎస్ ఆర్ మూర్తి (మంగళగిరి) కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: బాలిక(11)పై లైంగిక దాడి చేసి, ఆమెను గర్భవతిని చేసిన కేసులో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణ ఉప్పు బజారులో నివసించే 21 ఏళ్ల సతీష్‌చంద్ర అనే యువకుడు.. తన తండ్రి సహజీవనం చేస్తున్న మహిళ కుమార్తెపై ఏడాదిగా లైంగిక దాడికి పాల్పడుతూ.. ఆమెను గర్భవతిని చేశాడు. ఈ నెల 3న కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేశారు.

మహిళపై దాడి

తెనాలిరూరల్: ఓ మహిళపై దాడి చేసిన ఘటన నిందితులపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పూలే కాలనీకి చెందిన మరియమ్మతో నగదు విషయమై పొన్నూరుకు చెందిన కొందరు ఘర్షణ పడ్డారు. ఆమెపై దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



తెనాలిరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. కొందరు పరారవగా, ఇద్దరు పట్టుబడ్డారు. వివరాల మేరకు.. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామ పరిధిలోని నిమ్మ తోటల్లో పేకాట స్థావరంపై రూరల్ ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తన సిబ్బందితో దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. స్థావరం నిర్వాహకుడితో సహా కొందరు పరారయ్యారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.8,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరు వ్యాపారులకు.. ఆర్థిక చేయూత

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: చిరు వ్యాపారాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆర్థిక చేయూతనిస్తున్నాయని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 30వ వార్డు అమరావతి ప్లాట్స్ నుంచి మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ కొమ్మురబత్తిన జయపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ.. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల నగదును తమ చిరు వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు లబ్ధిదారులు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, వాటి ద్వారా పేదల జీవితాల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. అందువల్లే ప్రజలు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలనే ఆకాంక్షతో ప్రజలు ఉన్నారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రతి వార్డులో 86శాతం సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. 30వ వార్డులో 1,689 ఇళ్లు ఉండగా 4,497మంది జనాభా ఉన్నట్లు చెప్పారు. వైఎస్సార్ ఆసరా 341మందికి, వైఎస్సార్ సున్నా వడ్డీ 372, వైఎస్సార్ చేయూత 145, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన 207, జగనన్న అమ్మ ఒడి 309 మందికి ఇచ్చినట్లు చెప్పారు. అలాగే రూ.కోటితో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, వాటిలో ఇప్పటి వరకు రూ.80లక్షల పనులు పూర్తయ్యాయని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, దాసరి వసంతరావు, గొడవర్తి సాయిహరేరామ్, పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, గోగిరెడ్డి మాసనరెడ్డి, 30వ వార్డు నాయకులు గుమ్మడి నారాయణరావు, ఏసీ సిద్ధయ్య, నాగరాజు, కనపర్తి రజనీ, ఎం.గోపిచంద్, కె.వెంకట్రావు, ఎ.రమేష్, ఎస్.పురుషోత్తం, కె.వినోద్, వై.యోహాన్, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, కేసరి కృష్ణారెడ్డి, చుండూరి వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, చుండూరు సాయి, రావి శ్రీనివాసరావు, కుర్రా శ్రీను, దేవరపల్లి కిషోర్, చుక్కా ఆనంద్, డి.బాబు, షేక్ గపూర్, మద్దాలి శేషాచలం, కొల్లా గురునాధగుప్తా, కాకిదేవ సహాయం, పెదలంక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపు పథకాలపై పెరిగిన వడ్డీ రేట్లు

తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్



తెనాలి: పోస్టల్ పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను పెంచిందని, ఫలితంగా అధిక వడ్డీ పొందే అవకాశం ఉందని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ వెల్లడించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. స్థానిక ప్రధాన పోస్టాఫీసులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టైమ్ డిపాజిట్ పథకాలపై ఏడాది కాలపరిమితి గల పొదుపు పథకంలో 5.5 శాతంగా ఉన్న వడ్డీ 6.6 శాతానికి పెరిగిందని చెప్పారు. రెండేళ్లకు 5.7 నుంచి 6.8 శాతానికి, మూడేళ్లకు 5.8 నుంచి 6.9శాతానికి, ఐదేళ్లకు 6.7 నుంచి 7శాతానికి వడ్డీ రేటు పెరిగినట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్‌కు వడ్డీ 7.6 నుంచి 8 శాతానికి పెంచినట్టు చెప్పారు. మంత్లీ ఇన్‌కమ్ స్కీముకు 6.7 నుంచి 7.1 శాతానికి, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు వడ్డీని 6.8 నుంచి 7 శాతానికి పెంచినట్టు వివరించారు. కిసాన్ వికాస్ పత్రకు 7 నుంచి 7.2 శాతానికి వడ్డీ పెరిగిందన్నారు. ఖాతాదారులు తమ ఖాతాకు మొబైల్ నంబరును పోస్టాఫీసులో లింక్ చేసుకోవాలని సూచించారు. ఆర్థిక భద్రత కోసం ఖాతా పుస్తకాలను తమ వద్దనే ఉంచుకోవాలని కోరారు. పదేళ్లలోపు ఆడపిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి ఖాతాలను తెరిచేందుకు ఈ నెల 9, 10 తేదీల్లో మెగా మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. పదేళ్లలోపు ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆశ కార్యకర్తలు

తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు మంగళవారం కుష్టు వ్యాధికి సంబంధించి అవగాహన సదస్సు జరిపారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలతో సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆశల పనితీరు, ఏఎన్ఎంల ప్రగతి నివేదికలు పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో డాక్టర్ దిలీప్, సూపర్‌వైజర్లు లక్ష్మీప్రసన్న, శ్రీనివాసరావు, సుధారాణి, ఏఎన్ఎంలు, హెచ్ఏలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'శ్రీరామసాయి' వార్షిక మహోత్సవాలు



తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీరామసాయి జ్ఞాన మందిరం వార్షిక మహోత్సవాలు బుధవారం నుంచి జరుగనున్నాయి. మందిరంలో వేంచేసియున్న శ్రీ గణపతి, దత్తాత్రేయ, శ్రీరామదాసు సమేత శ్రీ సద్గురు, శ్రీ సాయి బాబా దివ్య మంగళరూప యజ్ఞ ప్రతిష్ఠ మహోత్సవాలు జరిగి 15 సంవత్సరాలు ముగిసిన సందర్భంగా వార్షిక మహోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నిత్య పుణ్యాధికాలు, హారతులు, అభిషేకాలు, ఏకాహం, భిక్షాటన, లలిత విష్ణు సహస్రనామ పారాయణం, భజనలు జరుగుతాయని తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు అంకురార్పణతో బాబా పల్లకీ సేవ జరుగుతుందని శ్రీరామసాయి ట్రస్ట్ అధ్యక్షుడు సంకా సతీష్, ఉపాధ్యక్షుడు మలిశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. అనంతరం 8 గంటలకు గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, కలశ స్థాపన, అఖండ జ్యోతి దీపారాధన నిర్వహిస్తారని వెల్లడించారు. 9 గంటల నుంచి మందిరంలో భజన సమాజం సాయి నామ సంకీర్తన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముగింపు రోజు ఆదివారం ఉదయం 5.15గంటలకు కాగడ హారతి, బాబాకు పంచామృత అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం జరుగుతుందని చెప్పారు. అనంతరం 10.30 గంటల నుంచి అన్న సంతర్పణ జరుగుతుందని, భక్తులు బాబాను దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని అర్చకులు కారంశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కొల్లిపర సీతారామ కోటేశ్వరరావు, అకరంశెట్టి నాగేశ్వరరావు, పోకల శివరామకృష్ణ, సంకా సీతారామయ్య, రవికుమార్, అమరేంద్రప్రసాద్‌లు తెలిపారు.

ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధి లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వల్లభాపురంలో ఏఎన్ఎం పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

వల్లభాపురం(కొల్లిపర): ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నిర్దేశించారు. మంగళవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలో సచివాలయం 1, 2 పరిధిలోని సిబ్బంది, అధికారులతో రచ్చబండ తరహాలో.. 'మీ సచివాలయం -మీ ఎమ్మెల్యే' అనే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామ సమస్యలు, అధికారుల పనితీరు గురించి చర్చించి, వాటిని వెంటనే పరిష్కరించారు. గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు రూ.40కోట్లు అందాయని, అభివృద్ధికి రూ.2.14కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఈ నెల 3న 104 వాహన సేవలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. వారు ఇచ్చిన రిజిష్టర్లో వైద్య సేవలు అందించినట్లు 80 పేర్లు నమోదు చేశారు. వారికి ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ చేసి వైద్య సేవలపై మాట్లాడారు. ఆ రోజు తమకు ఎలాంటి వైద్య సేవలు అందలేదని వారు చెప్పడంతో.. ఎమ్మెల్యే ఏఎన్ఎంలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరలా ఇలాంటివి ఘటనలు పునరావృతం అయితే తగు చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రెండు సచివాలయాల పరిధిలోని వార్డుల్లో రూ.40లక్షల నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ వల్లభాపురం నిర్మల, ఎంపీటీసీలు కేసరి రజిని, దానబోయిన సర్వేశ్వరరావు, తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డు చైర్మన్ అవుతు సీత నగేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, పార్టీ నాయకులు అవుతు శేఖర్‌రెడ్డి, లంకిరెడ్డి అప్పిరెడ్డి, మాకిరెడ్డి శివరామకృష్ణరెడ్డి, గాదె శ్రీను, వంగా సుధాకర్‌రెడ్డి, గుదిబండి రమేష్‌రెడ్డి, శివారెడ్డి, తాడిబోయిన రాంబాబు, వల్లభాపురం ధర్మారావు, కె.దేవాదాసు, వి.రవీంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి అలకనంద, వీఆర్వో సాయి, ఎంపీడీవో పి.శ్రీనివాసులు, తహసీల్దారు జి.నాంచారయ్య, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జెఈఈ మెయిన్స్‌లో చైతన్య విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో గాంధీ నగర్‌లోని శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. కోట సంజయ్ వేదకు 97.29, ఆలూరి భరణి 97.30, మేడికొండ భరత్ కుమార్ 92.11, ఎన్.శివసాయి మణికంఠ 91.05శాతం మార్కులు సాధించారని చెప్పారు. 62మంది విద్యార్థులు 90శాతానికి పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ బి.తిరుపతిరావు, ఎస్.సునీల్, శంకరరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: శానిటరీ షాపులో చోరీకి పాల్పడిన నిందితుడిని లాలాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపేట 2వ లైన్‌లో సుంకర కిరణ్ శానిటరీ షాపు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం కిరణ్ షాపులో రూ.2 లక్షల విలువైన శానిటరీ సామాను చోరీకి గురైంది. అయితే లాలాపేట పోలీసులు నిందితుడిని గుర్తించారు. షేక్ మస్తాన్‌వలిని మంగళవారం అరెస్టు చేసి చోరీ సొత్తు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

నెహ్రూనగర్: జిల్లాలోని అన్ని రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రవాణా వాహనాలకు, ట్రాక్టర్ ట్రైలర్లకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అమర్చుకోవాలని ఆదేశించారు.

పర్సు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ బ్యాగులోని పర్సును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగడిగుంట రెండో లైనుకు చెందిన అద్దంకి హైమావతి బంగారు నగలు కొనేందుకు మంగళవారం గంటలమ్మ చెట్టు వీధికి వెళ్లింది. కొద్దిసేటి తరువాత బ్యాగు పరిశీలించగా అందులోని పర్సు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికి పర్సు చోరీకి గురైనట్లు గుర్తించింది. పర్సులో రూ.లక్ష నగదు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూర ఈస్ట్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌లో నివాసం ఉండే చిలుకా గోపి (30) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. నాలుగు సంవత్సరాల క్రితం భార్యతో గొడవపడి విడిపోయాడు. గోపి మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నెల 2వ తేదీ గోపి మానసికంగా కుంగిపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 31లోపు పన్నులు వసూలు చేయాలి

కమిషనర్ ఎం.జశ్వంతరావు



మాట్లాడుతున్న కమిషనర్ జశ్వంతరావు

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలం, నీటి కొళాయి పన్నులను మార్చి 31లోపు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశించారు. పురపాలక సంఘ పరిధిలోని వార్డు అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ, ఇంజనీరింగ్ సిబ్బందితో మంగళవారం కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూరుశాతం పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పన్నులు చెల్లించని వారికి వెంటనే నోటీసులు అందజేయాలని, అలాంటి వారిని గుర్తించి అత్యవసర సర్వీసులు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. పురపాలక సంఘ కార్యాలయంలోని పన్నుల చెల్లింపుల కౌంటర్ సెలవు దినాల్లో కూడా ఉంటుందని చెప్పారు. అందరూ వెంటనే పన్నులు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ అప్పలరాజు, ఆర్ఐలు కుర్రా శ్రీను, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో పుష్పాలతో స్వామికి ప్రత్యేక పూజలు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో పుష్పోత్సవం నిర్వహించారు. వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో రఘురామ్, నాగమారుతీ, కిరణ్‌కుమార్, సురేష్‌లు పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటలకు శ్రీవారి పవళింపు సేవలు జరిపారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ అవుతు శ్రీనివాస్‌రెడ్డి, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌టీ శివ పర్యవేక్షించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు, ఆంజనేయస్వామి సంకీర్తన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలోని వేంచేసియున్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం శ్రీవారి పుష్పాయాగ మహోత్సవం శ్రీ వైఖానస ఆగమోక్త ప్రకారం జరిపారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహం, స్వామివారికి విశేష స్నపన, తిరుమంజనం, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి నివేదన, హారతి, మంత్రపుష్పం జరిపారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంజాం పున్నమాచార్యులు, లక్ష్మీ, శ్రీనివాసాచార్యులు, శారదాదేవి, కుటుంబసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా బాబా మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, డాక్టర్ ఓవీ రమణ, విశ్వనాథం

గుంటూరు ఈస్ట్: అమరావతి రోడ్డులోని శ్రీవెంకటేశ్వర కాలనీలో షిరిడీ సాయి ధ్యాన మందిరం 21వ వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. షిరిడీ సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణ చేసి మంగళహారతులు ఇచ్చారు. భక్తుల భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి బాబాకు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు చేశారు. షిరిడీ సాయి ఆధ్యాత్మిక, సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, వృద్ధుల ఆశ్రమంలో పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. గోరంట్ల ఐడీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ షిరిడీ సాయి ఆధ్యాత్మిక సేవా సమితి చేస్తున్న ఆధ్యాత్మిక, సమాజ సేవ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఓవీ రమణ, అధ్యక్షుడు విశ్వనాథం, కార్యదర్శి ఎస్.శ్రీధర్, వాణి సుజాత, వల్లి, అనుపోలు ఏడుకొండలు, పుట్టా ఏడుకొండలు, లలితా ప్రసాద్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి మస్తాన్‌షా దర్గా ఉరుసు మహోత్సవాలు

పాత గుంటూరు: నగరంపాలెంలోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా గంథం (ఉరుసు) మహోత్సవాలు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్త రావి రామ్మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న తెల్లవారుజామున చాందిని అలంకరణతో బాబా సమాధిపై గంథ మహోత్సవం, రాత్రి 11 గంటలకు గంథం ఊరేగింపు, అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు. 9న సాయంత్రం 4 గంటలకు గంథం పంపిణీ, 5 గంటలకు దీపారాధన, అన్నదానం, 10న రాత్రి 10 గంటలకు గ్యార్మీషరీఫ్ (ఖురాన్ పఠనం), తెల్లవారుజామున ప్రసాదం పంపిణీ, 11న ఫకీర్లకు అన్నదానం, బాబాకు భక్తులు సమర్పించిన శేష వస్త్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. 12న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని బాబాను దర్శించుకోవాలన్నారు.

ఉచిత మెంటర్‌షిప్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్-1 రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ రాణిసుస్మితతో ఉచిత మెంటర్‌షిప్ అందిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 040-35052121, 91332 37733 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

